# నగదు రహితం-అన్ని విధాలా ప్రయోజనం

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'ఈనాడు-ఈటీవీ' అవగాహన సదస్సు






అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏడీబీ(ఎస్బీహెచ్) మేనేజర్ రవిశంకర్‌ఠాగూర్; సదస్సులో పాల్గొన్న డిగ్రీ విద్యార్థులు

**మంథని, న్యూస్‌టుడే:** నగదు రహిత లావాదేవీలతో అన్ని విధాల ప్రయోజనం ఉందని ఏడీబీ(ఎస్బీహెచ్) మేనేజర్ రవి శంకర్‌ఠాగూర్ పేర్కొన్నారు. మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం 'పెద్దనోట్ల రద్దు- నగదు రహిత లావాదేవీలు' అనే అంశం ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ నల్ల ధనం వెలికితీతకు కేంద్రప్రభుత్వం పెద్దనోట్ల రద్దు చేయడం దేశప్రగతికి ఎంతో శుభపరిణామన్నారు. పెద్ద నోట్ల రద్దు తరువాత ఏర్పడిన ఆర్థిక ఇబ్బందులు అధిగమించడానికి స్వైప్, నెట్, మొబైల్ బ్యాంకింగ్ ద్వారా నగదు రహిత లావాదేవీలు నిర్వహించుకోవచ్చన్నారు. నెట్, మొబైల్ బ్యాంకింగ్ వినియోగం గురించి నగదు రహిత లావాదేవీలతో ఎంతటి సౌలభ్యం ఉందో వివరించారు. ప్రధానాచార్యుడు రమేశ్ పాల్గొన్నారు.

### దేశప్రగతికి పెద్దనోట్ల రద్దు మంచి నిర్ణయం

**- సాగర్, బీకాం**



పెద్దనోట్ల రద్దు నిర్ణయం దేశప్రగతికి దోహదపడుతుంది. కొందరికి ఇది ఇబ్బందిగా అనిపించినా తాత్కాలికమే. నగదు రహిత లావాదేవీలపై యువతగా మనమే ముందుకు వెళ్లాలి. మనకు తెలిసిన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇతరులకు తెలియజేసి నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించాలి. నేను కూడా ఇకపై నగదు రహిత లావాదేవీలు కొనసాగిస్తా.

### ఎక్కడి నుంచైనా లావాదేవీలు

**- రాజసమ్మయ్య**



ప్రధానమంత్రి నరేంద్రమోది తీసుకున్న సాహసోపేత నిర్ణయాన్ని అందరూ స్వాగతించాలి. నల్లధనంతో ధనవంతులు-పేదల మధ్య ఎంతో అంతరం ఉంటోంది. ఆర్థిక అసమానతలు తొలగడానికి నల్లధనం వెలికితీయాలి. పెద్ద నోట్ల రద్దు తరువాత నగదు కోసం సమస్యలు వచ్చినా తరువాత ప్రజలకు మంచి జరుగుతుంది.

### విదేశాల్లోని సొమ్మును దేశానికి తేవాలి

**- సామియెల్**



నల్లకుబేరుల భరతం పట్టేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోది కఠిన నిర్ణయం తీసుకోవడాన్ని అంతా హర్షించాలి. కేంద్రప్రభుత్వం విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని కూడా తెప్పిస్తే మన దేశం ఆర్థికంగా బాగుపడుతుంది. స్మార్ట్‌ఫోన్లు వినియోగించే వారంతా మొబైల్ బ్యాంకింగ్ బాట పడితే నగదు రహిత లావాదేవీలు పెరుగుతాయి.

### పన్నుల వసూళ్లతో ఆర్థిక ప్రగతి

**- ఆనంద్**



పెద్దనోట్ల రద్దును ఎంతో మంచి నిర్ణయం. కానీ పేదలు మాత్రం డబ్బుల కోసం ఎంతో ఇబ్బంది పడుతున్నా తాత్కాలికమే కాబట్టి పెద్దగా సమస్య కాదు. నగదు రహిత లావాదేవీలను పెంచడం ద్వారా డబ్బున్న వాళ్లంతా పన్నుల పరిధిలోకి వస్తారు. దీనివల్ల ప్రభుత్వానికి పన్ను రూపంలో ఆదాయం పెరిగి దేశ ప్రగతికి దోహదపడుతుంది.

### పేదలే ఎక్కువ ఇబ్బంది పడుతున్నారు

**- నాగలక్ష్మి**



పెద్దనోట్ల రద్దు తరువాత ఎక్కువగా ఇబ్బంది పడుతున్నది పేదలే. నల్లకుబేరులెవరూ బ్యాంకులు, ఏటీఎంలకు రావడం లేదు. తమకున్న పరపతితో నల్లధనాన్ని అడ్డదారుల్లో తెల్లగా మార్చుకుంటున్నారు. రూ.2వేల నోట్ల కట్టలు రూ. కోట్లలో దొరుకుతున్నాయి. ఇందులో బాధ్యులపై చర్యలు తీసుకోకుంటే పెద్దనోట్లు రద్దు చేసిన లక్ష్యం నీరుగారిపోతుంది.

### అభివృద్ధి చెందిన దేశంగా గుర్తింపు రావాలి

**- శ్రీకాంత్**



నల్లధనం బయటకు తీసుకునేందుకు ప్రధానమంత్రి తీసుకున్న నిర్ణయం సఫలం కావాలి. మన దేశం అభివృద్ధి చెందుతున్న దేశంగానే గుర్తింపు పొందింది. కానీ విదేశాల్లోని నల్లధనం మన దేశానికి రావాలి. అన్ని రంగాల్లో పారదర్శకత పెరగాలి. అవినీతి, అక్రమాలకు అడ్డుకట్టపడాలి. అభివృద్ధి చెందిన దేశంగా మనం గుర్తింపు పొందాలి.

### గ్రామీణులకు అవగాహన కల్పించాలి

**- రాజ్‌కుమార్**



సమస్యను పరిష్కరించేందుకు గ్రామీణులకు నగదు రహిత లావాదేవీలపై అవగాహన కల్పించాలి. ప్రతి ఇంట్లో ఒకరైనా చదువుకున్నవారుంటారు. వారికి నెట్, మొబైల్ బ్యాంకింగ్ గురించి తెలియజేయాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాలను దత్తత తీసుకుని నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించాలి.

### పేదలకు ప్రాధాన్యమివ్వాలి

**- శ్రీకన్య**



పెద్దనోట్ల రద్దు తరువాత పేదలు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఉన్న కాస్త డబ్బులు బ్యాంకుల్లో నుంచి తీసుకోలేని పరిస్థితిలో ఉన్నారు. ధనవంతులు ఎలాగోలా తమ ఆర్థిక అవసరాలు తీర్చుకుంటున్నారు. అందుకే బ్యాంకుల్లో నగదు చెల్లింపు విషయంలో పేదలకు తగిన ప్రాధాన్యమివ్వాలి. చెల్లింపులకు ఉన్న పరిమితి తొలగించాలి.